# పులిని చూసి—

లక్ష్మమ్మకి వచ్చిన బాధ ఒక్కటే. ఈ యేడు తన మేనల్లుడు బళ్ళో జేరుతున్నాడు. ప్రక్కింటి భద్రమ్మ కొడుకుని కూడా జేర్పిస్తున్నారు. వాళ్ళిద్దరూ తన కొడుకు కంటె చిన్నవాళ్ళే వయస్సుకి. కాని చాలా చురుకైనవాళ్లు. తన కొడుకు నిజానికి వాళ్ళంత చురుకైన వాడు కాదు, ఇంకా మాటలన్నీ సరిగ్గా పలకలేడు. కొంచెం ముద్ద మాట.... ముద్దు ఎక్కువవడంవల్ల అలా వచ్చిందని అంటారు చుట్టాలు. వాళ్ళకేం తెలుస్తుంది- తన బాధ? వెనక అక్షరాభ్యాసనకూడా ఇరుగు పొరుగు వాళ్ళతో వంతుకువెళ్ళే చేయించింది. పోనీఅక్షరాభ్యాసనఅయాకేనా వాడికి నాలుగు ముక్కలు అంటకూడదూ? అదీలేదు. ప్రవేటు మేష్టర్ని పెట్టింది చివరకి అ మేష్టరు ఎంత చించుకు చెప్తేనేం? వాడికి అక్షరంముక్క అంటటం లెదు. నెల తిరిగే సరికి డబ్బివ్వటం మాత్రం తప్పటం లేదు మేష్టరికి. పోనీ తను కుర్రాడికేమైనా లోటుచేసిందా? పువ్వుల్లోపెట్టి పెంచుతోందే? అదే లోటు అంటారు ఆయన— ఆయనదంతా అదొక ధోరణి. వాడిని బలవంతంగా ఎన్నడూ లేపదు నిద్రనుంచి— ఎదిగేవేళ పాడుచెయ్యట మెందుకని. అయినా లేచి మాత్రం వాడు ఏంచెయ్యాలి? కుర్రకుంక. ఇంతమంది పెద్దవాళ్ళమూ ఉండి వాడికే చెప్పాలా పనులు? తను లేనప్పుడు వాడు ఎలాగూ చేసుకోవాలి ఆయిరి. మామగారు ఈవిషయమై కేకలేస్తారు. వాడికికూడా నాలుగు పనులూ నేర్పాలంటారు. ఇప్పటినుంచీ వాడిని పనుల్లో పెట్టడం ఎందుకనిపిస్తుంది తనకి! అయినా తన కొడుక్కి పనులు చెప్పుకోడేం మామగారు? లక్ష్మమ్మ కొడుకైతే చిన్నప్పటినుంచీ నేర్చుకోవాలిట. అవును మరి! ఎదటి వాళ్ళకి చెప్పటానికేం? ఎన్నైనా చెప్పొచ్చు. సరే, దానికేం? కుర్రాడికి ప్రతిరోజూ ప్రొద్దుట ఇస్త్రీ జత ఇస్తుందాయె! బట్టలు నలిగి మాసి పోతాయని వాడిని క్రింద కూచోనీయదు. ఒక రోజున కుర్చీలన్నీ ఏదో పనిమీద ఉండి ఒక్క కుర్చీయే ఉంటే మేష్టారిని కింద కూర్చుని చెప్పమంది పారం. పిల్లావాడు కుర్చీలో కూర్చుంటే తనుకిందేమిటని ఏమన్నా అనుకున్నాడో యేమో గాని ఆవేల్టకి అలాగే పాఠంచెప్పాడు ఆమేష్టారు. తను ఎరుగున్నంతలో వాడికేమీ లోటు చెయ్యలేదు. వాళ్ళనాన్న కలం, సిరాబుడ్డి కొని తెచ్చి వ్రాసుకోమని యిస్తే తను వాటిని దూరంగా విసిరేసి ఫౌంటెన్ పెన్ను కొని యిచ్చింది. అయినా ఈ రోజుల్లోకూడా కలం, సిరాబుడ్డి యేమిటి పల్లెటూరి వాడిలాగ! .... అవన్నీచూస్తే తనకి చాలా సిగ్గువేసింది. వాడికి ఏదైనా కొనుక్కోమని రోజూ బేడా, పావలా చేతులో పెడుతూనే ఉంది. ముందూ వెనకా ఆలోచించకుండా ఒకరోజున ఆ పంతులు వీడిని కొట్టాడు. అవును. కొడతాడు. వాడికేం తెలుస్తుంది? చిట్టిబాబు ఒళ్ళు ఎంత కందిపోయిందని? వాడి సొమ్మేం పోయింది? వీడికి ఎక్కాలు రాకపోతే వాడికి జీతమేమన్నా తగ్గిందా? వీడినెందుకు కొట్టుకోవడం? వాడి చేతులు కాలా! తన కొడుక్కి అసలు ఎక్కాలు రానక్కరలేదు. ఎందుకురావాలి? డబ్బులేని బీద వెధవల్లాగ అహోరాత్రాలు కూచుని నిచ్చెనల్లాంటి అర్థంలేని ఆ పాడు ఎక్కాలు కంఠస్థం చెయ్యకపోతే యేమన్నా లోపమా తన కొడుక్కి? తనకి ఉన్నదేదో తనకుంది కుర్రాడి జీవితానికి లోటు లేదు. కాదు. లోటే అనుకో. అయితేమాత్రం? ఈ యేక్కాలు రాకపోతే ఇంక వాడెందుకూ పనికిరాడూ? తెలివితేటలు లేకపోతే సరి! వెధవ యేక్కాలు రాని వాళ్ళు ఎందరు లక్షలు సంపాదించలేదు? దేనికేనా అదృష్టం ప్రధానం. వాడి జాతకం చూసిన వాళ్ళంతా వాడు యోగజాతకుడని అంటూనే ఉన్నారు. మొన్న అయిదు రూపాయలిచ్చి ప్రశ్న వేస్తే వాడేమన్నాడు? కోటీశ్వరుడవుతాడన్నాడు. కోటీశ్వరుడయేవాడికి ఈ చిన్న విషయాలమీద ఏం శ్రద్ధ ఉంటుంది? వాడికి ఈ యేక్కాలొక లెక్కా? అందుకే కాబోలు భగవంతుడు వీడికి ఈ స్వల్ప విషయాలు తెలియకుండా చేశాడు.

ఇవన్నీ ఇలా ఉండగా గోరు చుట్టుమీద రోకటిపోటు అన్నట్టు తన మేనల్లుడిని, భద్రమ్మ కొడుకుని ఈ యేడే స్కూల్లో జేర్పించడమా? ఎవరో తరుముకు వస్తున్నట్టు! వాళ్ళిద్దరూ బాబుకంటె చిన్నవాళ్ళేనాయిరి! చిన్నో పెద్దో తనకేం పని? భగవంతుడు వీడిని వాళ్ళతో సమానంగా ఉండనివ్వడు చదువులో. వాళ్ళు ఏ లెక్క యిచ్చినా

రచన:

శ్రీ మధిర భానుమూర్తి

చెయ్యగలరట! భారత భాగవతాలు తడుముకోకుండా చదవగలరట! భద్రమ్మకి అందుకేగా అంత విరగబాటు! ఎగిరి ఎగిరి పడటం! భద్రమ్మ కొడుకుని హెడ్మాష్టారు చాలా మెచ్చుకున్నాడట! మెచ్చుకుంటాడు! మెచ్చుకోడు మరి! కాస్త స్థితిగతులు గట్రా ఆలోచన యేమీ అక్కర్లేదూ? భద్రమ్మ మొగుడి ఉద్యోగం ఏం గొప్పదా? భద్రమ్మ మామగారు ఏమన్నా లక్షల క్రొద్దీ సంపాదించాడా? తన కొడుకు కట్టే ఒక్క జత విలువలేదే భద్రమ్మ కొడుకు బట్టలన్నీ పోగేస్తే! ఒక్క చుట్టు జరీ చీర ఉందా భద్రమ్మకి! ఏమిటో ఆ రోజులే పోయాయి. వెనకయితే తన కొడుకుని పంతుళ్ళు బ్రతిమాలి చేర్చుకునేవారు. ఇప్పుడు వాళ్ళూ మారిపోయారు. ఎక్కడా పరువు ప్రతిష్ఠలు ఖాతరు చెయ్యటంలేదు. లేకపోతే యిదేమిటి? నాలుగు రోజులనాడు ప్రైవేటు మాష్టరుని తను అడిగింది కుర్రాడి పరిస్థితిని గురించి. ఇన్నాళ్ళూ డబ్బు పుచ్చుకుని "ఈ యేటికి ఊసుకుని మీదటికి తప్పకుండా జేరుద్దాం" అన్నాడు. వాడి మొహం! వాడికి ఏం తెలుసు? అయినా వీడు ఒక మాట మీద నిలబడడుగా! భద్రమ్మ కొడుకుని ఈ యేడు జేర్చి తీరాలని పట్టు పడుతున్నడి వీడే! దుర్మార్గుడు. ఏం? తన కొడుకు భద్రమ్మ కొడుకుపాటి చెయ్యడూ? అసలు వీడి చేత ప్రైవేటు చెప్పించటమేమిటి? తన తెలివితక్కువ గాని! పాపం ఇంకో మేష్టరు వచ్చి తనచేత ప్రైవేటు చెప్పిస్తే ఈ యేడు తప్పకుండా కుర్రాడిని బళ్ళో వేయిస్తానని హామీ ఇచ్చాడు. వాడిని కాలదన్నింది— వీడేదో నిర్వాకం చేస్తాడుగదా అని ఆశతో! ఇంతకీ ఒకళ్ళననుకోవడం దేనికి? ఆమేష్టరినే పెట్టి ఉంటే తనూ నలుగురిలో తల యెత్తుకు తిరగగలుగునుగదా! సౌభాగ్యం కొడుకు (తన మేనల్లుడు) బాబుకన్న రెండేళ్ళు వెనకగా పుస్తకం పట్టాడు. అయితేనేం? నిక్షేపంలా ఈ యేడు బళ్ళో జేరుతున్నాడు. అప్పుడే ప్రైవేటు మాస్టరు అన్నమాట ఊరంతా పొక్కింది. ఎలా పొక్కిందో! ఎలాగ ఏమిటి? కిట్టనివాళ్ళుంటారు. వాళ్ళు మోసుకుపోతారు. అందరికీ చెప్పివస్తారు.

వాళ్ళననుకోవటం ఎందుకు? అనవసరం! నిజంగా బాబు స్థితి అలా ఉండేమో! ఈయేటికి పనికిరాడేమో! పనికి రాకపోతే మనమేం చెయ్యగలం? మనమేమిటి?— ఎవరూ ఏమీ చెయ్యలేరు. చెయ్యలేకపోవడమేమిటి? చేసితీరాలి! వాడు ఈ యేడు బళ్ళో జేరాలి! జేరటానికి కావలసినవన్నీ వాడికి వచ్చును. ఏం వచ్చును? ప్రైవేటు మేష్టరు చెప్పాడుగా ఏమీ రాదని? ఆఁ! చెప్తాడు! చెప్పడుమరి! వాడికొకటి వస్తేగా! తనకొడుక్కి రాకపోవడమేమిటి? రావలసిందే! వచ్చితీరాలి!

ఏమిటో ఇదంతా తన బాధేగాని ఆయనేమీ పట్టించుకోరు. పైగా "ఈ యేడు మన బాబుని బళ్ళో జేర్చా"లని తనంటే ఆయన అదేదో వీధివాళ్ళ గొడవలాగ పట్టించుకోలేదు. పోనీ పరాకుగా ఉన్నారేమోనని ఒకసారి రెండుసార్లు చెపితే "అప్పుడే ఆ వెధవని హైస్కూల్లో జేర్చటమేమిటి? మతిలేకపోతేను? తరువాత చూద్దాం!" అన్నారు తరువాతట! తరువాత! తరువాత ఎప్పుడు ఇంకా? మళ్ళీ ఏడా? అబ్బో! మళ్ళీ ఏటిదాకానా? లాభం లేదు. అప్పటికి భద్రమ్మ కొడుకూ, సౌభాగ్యం కొడుకూ పైక్లాసులోకి వెళ్ళిపోరూ? వాళ్లు పైక్లాసులో ఉంటే బాబు కింద క్లాసులో ఉండాలా? వాడి ఖర్మవేం కాలలేదు వాడూ పైక్లాసులోనే ఉండాలి! లేకపోతే భద్రమ్మని సౌభాగ్యాన్ని పట్టపగ్గాలుంటాయూ? అప్పుడే ప్రారంభించిందట భద్రమ్మ తననుగురించీ, తన బాబును గురించీ "ఆఁ! లక్ష్మమ్మ కొడుకుని ఈయేడు జేర్చటమా? మళ్ళీయేటికి పనికివస్తే ఈయేడు జేర్చినట్టే!" అని. అదివింటే తనకెంత కష్టం కలిగింది? ఇవన్నీ ఆయనకేం తెలుస్తాయి? పగలల్లా వీధులో ఉంటారాయిరి! వచ్చే వెళ్ళే అమ్మలక్కలు అందరికీ జవాబు చెప్పవలసింది తను. ప్రతీవాళ్ళూ అడిగేవాళ్ళే! "ఈ యేడు మీ బాబుని హైస్కూల్లో వేస్తారా?" అని. వాళ్ళందరికీ ఏదో జవాబు చెప్పాలిగా! "ఈ యేటికి జేర్చమంటే నలుగురిలో తనకి ఎంత తలవంపులు? అయినా అంతా తెలివైన వాళ్ళే ఉంటారేమిటి? తన అన్నకొడుకు— మొద్దు వెధవలా ఉండేవాడు మొదట్లో- ఎం. ఏ. ప్యాసయాడు. ఏం చెప్పగలం? బాబుకూడా అలాగే ప్యాసవవచ్చు. ఏమయినా ఈ యేడు జేర్చక తప్పదు. ఆయన కాకపోతే తనైనా జేర్చాలి. చదువు కోసం కాకపోతే నలుగురిలో తలెత్తుకు తిరిగేందుకైనా జేర్చాలి! జేర్చితీరాలి!

---